సాక్షి నిర్మల్

గురువారం । 15 । ఆగస్టు । 2024



మెడికోలకు భద్రతెంత?

ప్రాణాలు పోసే డాక్టర్లకు రక్షణ కరువైంది. వైద్యులపై జరుగుతున్న దాడులు, అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. IIలో▸



'సీసీ' లేకుంటే జరిమానా

నేరాల నియంత్రణకు పోలీసులు దృష్టి సారిస్తున్నారు. భైంసాలోని దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
31.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు'



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య చేట్టిన ఇథనాల్ ప్రాజెక్ట్ పనులు వెంటనే నిలిపివేయాలని బుధవారం దిలావర్‌పూర్ గ్రామస్తులు, రైతులు అధికసంఖ్యలో వచ్చి కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవో, తహసీల్దార్ బృందాన్ని ఆదేశించారు.

కోల్‌కతా ఘటనపై నిరసన



నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని నిర్మల్ ప్రభుత్వ వైద్యకళాశాల జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ బుధవారం నిర్మల్ మెడికల్ కళాశాల ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశవ్యాప్తంగా వైద్యులకు రక్షణ కల్పించేందుకు వెంటనే చట్టం అమలు చేయాలని, దుండగుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

నిర్మల్‌టౌన్: మాదక ద్రవ్యాలను అరికట్టాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి నాగమణి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్, వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుని శక్తివంతమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యాధికారి పరశురాం, ప్రిన్సిపాల్‌లు జూపి షాన్, తుకారాం, ఏసీడీపీవో నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్టు కొట్టిన వ్యక్తికి జరిమానా



విఠల్‌కు జరిమానా రశీదు ఇస్తున్న సిబ్బంది

సారంగపూర్: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో తన షాపునకు అడ్డుగా ఉన్నట్లు భావించి రోడ్డు వెంట నాటిన చెట్టు నరికిన విఠల్‌కు పంచాయతీ సిబ్బంది బుధవారం రూ.2,500 జరిమానా విధించారు. రెండు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని విఠల్‌కు సూచించారు. కారోబార్ ఉమామహేశ్వర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైతులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కడెం: లక్ష్మీపూర్ లిఫ్ట్ కోసం కడెం, దస్తూరాబాద్ మండలాల్లోని లక్ష్మీపూర్, నవాబ్‌పేట్, కల్లెడ, అకొండపేట్ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్‌ను కలిశారు. కడెం నది వంతెన వద్ద గతంలో ప్రతిపాదించిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వారు విజ్ఞప్తి చేశారు.

అమరవీరులను గుర్తిద్దాం..



నిర్మల్–ఎల్లపెల్లి దారిలో వెయ్యిఉరుల మర్రి సమీపంలోని అమరవీరుల స్తూపం

- పోరుగడ్డకు గుర్తింపేది?
- వీరచరితకు విలువేది?
- 'ప్రథమపోరు'లోనే పాల్గొన్న చరిత్ర
- నేటికీ పుస్తకాలకెక్కని ఘనత
- పంద్రాగస్టు రోజైనా గుర్తిద్దాం



స్వాతంత్య్రపోరులో పాల్గొన్న జిల్లాకు చెందిన సమరయోధులు (ఫైల్)

నిర్మల్: ఇప్పుడు కాదు.. అప్పుడు కాదు.. ఏకంగా ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామంలోనే పోరాడిన గడ్డ మన నిర్మల్. దేశ బానిస సంకెళ్లను తెంచడానికి వీరులెందరో ప్రాణాలర్పించిన త్యాగభూమి. తమ జీవితాలను పణంగా పెట్టి పోరులో దూకిన సమరయోధులెందరికో జన్మనిచ్చిన నేల ఇది. అసలు.. ఇలాంటి ఘటనొక్కటి స్వాతంత్య్రపోరాటంలో జరిగింది.. అని ఇప్పటికీ చాలామందికి తెలియని 'వెయ్యి ఉరులమర్రి' వీరగాథకు సజీవసాక్ష్యం నిర్మల్. ఇంతటి ఘనతను తనలో నింపుకొన్నా.. చరిత్రలో ఎక్కడా ఒక్క అక్షరం కూడా లేకపోవడం, భావితరాలకు తెలియకపోవడం అత్యంత విచారకరమైన విషయం. తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా.. జిల్లాగా మారి ఎనిమిదేళ్లవుతున్నా.. ఇప్పటికీ రాంజీగోండు సహా వెయ్యిమంది వీరుల త్యాగం, నెలల తరబడి జైలు జీవితాన్ని అనుభవించిన ఎంతోమంది సమరయోధుల పోరాటం ఎక్కడా చర్చకు రాకపోవడం దారుణం. పాలకులు, అధికారులు మారుతున్నా.. ఎవరూ కనీసం పట్టించుకోకపోవడం శోచనీయమని జిల్లాప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనీసం స్వాతంత్య్ర దినోత్సవ వేడుక రోజైనా అమరవీరులను గుర్తిద్దామని, సమరయోధులకు జైకొడదామని కోరుతున్నారు.

చరిత్రకెక్కని వీరగాథ...

ఇప్పటివరకు చరిత్రలో ఎక్కడా రాయకున్నా.. ఏ పాలకుడూ పట్టించుకోకున్నా.. ఈ ప్రాంతానికి ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామం (సిపాయిల తిరుగుబాటు)లోనే పాల్గొన్న ఘనత ఉంది. 1857లో ఉత్తర భారతంలో ప్రారంభమైన నాటి ప్రథమ స్వతంత్ర సంగ్రామాన్ని నిర్మల్ ప్రాంతంలో గోండు రాజైన రాంజీ ముందుకు సాగించాడు. ఆయన నాయకత్వంలో తాంతియతోపే అనుచరులైన రోహిల్లాలతో కలిసి ఏకకాలంలో ఆంగ్లేయులు, స్థానిక హైదరాబాద్ పాలకులతో పోరాటం కొనసాగించారు. బ్రిటీష్‌వారికి చెందిన కలెక్టర్ నివాసప్రాంతమైన నిర్మల్ ప్రాంతంలోనే తన పోరాటం సాగించారు. ఇక్కడి సహజసిద్ధమైన అడవులు, గుట్టలు, చెరువులు, గోదావరి నదిని తమకు అనుకూలంగా మలుచుకుని పోరాడారు.

ఒకే మర్రికి వెయ్యిమంది ఉరి..

రోజుల తరబడి శత్రుమూకలను ముప్పుతిప్పలు పెట్టిన రాంజీగోండు సైన్యాన్ని చివరకు నాటి పాలకులు దొంగదెబ్బ తీశారు. రాంజీగోండు సహా వెయ్యిమంది వీరులను పట్టుకున్నారు. వారందరినీ అతిదారుణంగా హింసించారు. నిర్మల్–ఎల్లపెల్లి మార్గంలోని మహా మర్రిచెట్టుకు రాంజీ సహా వెయ్యిమంది వీరులను ఒకేసారి ఉరితీశారు.

ఘోషిస్తున్న అమరుల ఆత్మలు

ఒకే మర్రిచెట్టుకు వెయ్యిమందిని ఉరితీసిన ఘటన దేశచరిత్రలోనే ఎక్కడా జరగలేదు. జలియన్‌వాలా బాగ్ కంటే ముందే.. అంతకంటే దారుణంగా జరిగిన ఈ ఘటనకు ఇప్పటికీ అక్షరరూపం లేదు. ఎక్కడా ఒక పాఠంలో పొందుపర్చలేదు. తమ ప్రాణత్యాగాలను కనీసం స్థానిక పాలకులు, అధికారులు కూడా గుర్తించకపోవడంతో వారి ఆత్మలు నిత్యం ఘోషిస్తూనే ఉన్నాయి. తమకు విగ్రహాలు, మ్యూజియాలు పెట్టాల్సిన అవసరం లేదని, ఇప్పుడు మీరు పీలుస్తున్న స్వేచ్ఛావాయువులకు కారణమైన తమను భావితరాలకు తెలియజెప్పాలని కోరుతున్నాయి.

సమరయోధులెందరో..

రాంజీగోండు సహా వెయ్యిమంది అమరవీరుల స్ఫూర్తితో ఎంతోమంది సమరయోధులు స్వాతంత్య్ర పోరాటంలో దూకారు. ప్రాణాలనూ లెక్కచేయకుండా శత్రుమూకలపై పోరాడారు. తొలిదశ పోరులో రాంజీగోండు ప్రజలను ఏకం చేస్తే.. మలిదశ పోరులో నిర్మల్ ప్రాంతానికి చెందిన ఎంతోమంది స్వాతంత్య్ర సమరయోధులు సంఘటితంగా పరాయిపాలనపై ఉద్యమించారు. నాటి నిర్మల్ పంచాయతీ సమితి పరిధిలో గోపిడి గంగారెడ్డి, గణపతి, బాపూరావు, బోరేగాం గజన్న, లాలు పటేల్, ఏ రాజన్న, పోశెట్టి, గంగాధర్, శివన్న, గంగారాం, విఠల్‌రావు, జమునాలాల్, వెంకోబరావు, చిన్న నర్సింహులు, లింగారెడ్డి, సుందర్‌రాజ్, ముడుసు ఎల్లయ్య, అర్గుల గంగాధర్‌గుప్తా, గాంధారి లక్ష్మణ్, ఠాకూర్ హన్మంత్‌రావు.. ఇలా ఎంతోమంది సమరయోధులు స్వాతంత్య్రం కోసం పోరాడారు. నిరంకుశ నిజాం పాలనను ఎదుర్కొనేందుకు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో పోరాటాలను నిర్మించారు. స్థానిక నాయిడివాడ (రాంరావ్ బాగ్)లో గల ఆర్యసమాజ్ మందిరం కేంద్రంగా పోరాటాలకు రూపకల్పన చేసేవారు.

ఇదేనా గుర్తింపు..

రాంజీ సహా అమరవీరులను పాలకులు, అధికారులు ఇప్పటికీ గుర్తించడం లేదు. ఏవో కొన్ని సంఘాలు కార్యక్రమాలు చేస్తున్నాయి. ఎల్లపల్లి శివారులోని అమరుల స్తూపం, చైన్‌గేట్ వద్ద ఉన్న రాంజీ, భీమ్ విగ్రహాలు ఇప్పటికీ తాగుబోతుల అడ్డాలుగా ఉండటం బాధాకరమైన విషయం. ఇక సమరయోధులనూ అధికారులు అవమాన పరుస్తున్నారు. వారు చేసిన పోరాటాలకు గుర్తుగా జిల్లాకేంద్రంలోని పాత అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వారి పేర్లతో ఓ స్తూపాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయాన్ని కూల్చేసిన తర్వాత వారి పేర్లతో ఉన్న స్తూపాన్ని తెచ్చి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో అలా పడేయడం దారుణం. దేశం కోసం ప్రాణాలనూ పణంగా పెట్టి పోరాడిన అమరులు, వీరులకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఇప్పటికీ నిర్మల్ నిశ్శబ్దంగా నిరసన తెలుపుతూనే ఉంది. కనీసం పంద్రాగస్టులాంటి వేడుకల్లోనైనా వారి పోరాటాలు, త్యాగాలను గుర్తించాలని మౌనంగా కోరుతోంది.

నెలల తరబడి జైళ్లల్లో..

నైజాం, ఆంగ్లేయుల అణచివేతలో భాగంగా ఎంతోమంది సమరయోధులు జైళ్లకు వెళ్లారు. స్థానిక జైళ్లల్లో కాకుండా వీరిని ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని నాందేడ్, చంద్రాపూర్, ఔరంగాబాద్ తదితర దూర ప్రాంత జైళ్లకు పంపించేవారు. అక్కడ నెలల తరబడి మనవాళ్లు జైళ్లల్లో మగ్గేవారు. ఒక్కోసారి ఎన్ని నెలలైనా వాళ్లు ఇంటికి రాకపోవడంతో ఇక వారు చనిపోయారేమో అనుకుని కర్మకాండలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా వెరువకుండా వారంతా పోరు సాగించారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం వచ్చినా.. నిజాం పాలనలోని తెలంగాణ ప్రాంతంలో మాత్రం రాలేదు. ఈ సమయంలో పెరిగిపోయిన రజాకార్ల దౌర్జన్యాలపైనా సమరయోధులు అసమాన పోరాటం చేశారు.

మద్యమాంసాలకు దూరం



తానూరు మండలం ఝరి(బీ)లో మద్యం ముట్టుకోబోమని ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

- భక్తిమార్గం.. సేవాతత్వం
- ప్రచారానికి దూరం.. నిరాడంబర జీవితం
- వారిదంతా శ్రమైక జీవన సౌందర్యం
- సంఘటిత నిర్ణయాలు.. సామూహిక వివాహాలు
- మారుమూల పల్లెలు.. ఆదర్శ గ్రామాలు

నిర్మల్: అభివృద్ధికి కేరాఫ్‌గా చెప్పుకొనే మన రాజధాని హైదరాబాద్‌కు ఆ ఊళ్లు దాదాపు 350కిలో మీటర్ల దూరంలో ఉంటాయి. అక్కడి ప్రజలంతా భూతల్లిని నమ్ముకుని పచ్చని పంటలు పండించుకునే శ్రమైక జీవులు. వాళ్ల మనసుల్లో కల్మషం లేదు. ఆ మనషులకు ఎలాంటి హంగుఆర్భాటాలు అవసరం లేదు. నలుగురు కలిస్తే పార్టీలు చేసుకోవడం, మందుమాంసాలతో మజా చేయడం ఈ రోజుల్లో కామన్‌గా మారింది. కానీ.. ఆ గ్రామాలు మాత్రం ఇప్పటికీ మద్యమాంసాలకు దూరంగా ప్రశాంత జీవనం సాగిస్తున్నాయి. సంఘటిత నిర్ణయాలు తీసుకుంటూ సామూహిక వివాహాలు చేస్తూ.. నేటి స్వాతంత్య్ర భారతానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని కుభీర్, తానూరు, మామడ మండలాల్లోని ఆ గ్రామాల గురించి..

పాంగ్రాలో మూడు పిడీల నుంచి..

కుభీర్ మండలం పాంగ్రా గ్రామంలో మూడు వందల ఏళ్లుగా మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. భైంసా పట్టణం నుంచి కుభీర్ వెళ్లే మార్గంలో గల ఈ గ్రామం ఇప్పటికీ మద్యమాంసాలను ముట్టకోలేదంటే అతిశయోక్తి కాదు. వేరే గ్రామం నుంచి ఇక్కడికి వచ్చిన కోడళ్లు, అల్లుళ్లూ వీరి బాటలోనే నడుస్తుండటం విశేషం. నేటితరం యువత కూడా మద్యపానానికి దూరంగా ఉంటున్నారు. గ్రామంలో ఉన్నా.. చదువుకునేందుకు పట్నం వెళ్లినా తమ ఊరి పద్ధతినే పాటిస్తున్నారు. ఏకముఖి దత్తాత్రేయ ఆలయం ఈ ఊరి ప్రత్యేకత. దత్తాత్రేయ బోధనలే పాంగ్రాను వ్యసనాలకు దూరంగా ఉంచుతున్నాయంటారు ఇక్కడివారు.

బాకోట్, సౌనా గ్రామాల్లోనూ..

కుభీర్ మండలంలోనే పాంగ్రా సమీపంలో గల బాకోట్, సౌనా గ్రామాలూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఎంత పెద్ద పండుగైనా.. ఎంతటి వేడుకైనా.. ఈ గ్రామాల్లోనూ మద్యం, మాంసాలను ముట్టుకోరు. ఏదైన ఫంక్షన్ ఉంటే లడ్డూ, బోంది వంటి తీపిపదార్థాలతోనే వేడుకలను చేసుకుంటారు. మద్యమాంసాలకు దూరంగా ఉన్నందునే తమ గ్రామాల్లో గొడవలు లేవని, ఇప్పటిదాకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన దాఖలాలు కూడా లేవని వారు చెబుతున్నారు.

ఆదర్శ'ఝరి'...

ప్రశాంతంగా ఉండాల్సిన ఆ ఊరు మద్యపానంతో ఒకప్పుడు పరేషాన్లకు వేదికగా ఉండేది. అలాంటి గ్రామం మద్యాన్ని దూరం పెట్టి ఆదర్శంగా నిలుస్తోంది. తానూరు మండలం ఝరి(బీ) గ్రామంలో కొన్నేళ్ల క్రితం ఊరంతా కలిసి మద్యపానాన్ని నిషేధించుకున్నారు. కలసికట్టుగా ప్రతిజ్ఞ చేశారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన శేష్‌రావ్ మహరాజ్ మద్యనిషేధం, సమష్టితత్వం, సన్మార్గం.. తదితర అంశాలపై చేసిన ప్రవచనాలూ వారిని కదిలించాయి. ఈ ఊరు మద్యనిషేధానికే కాదు.. సమష్టితత్వానికి, సామూహిక వివాహాలకూ వేదికవుతోంది. అనవసర ఖర్చులు తగ్గించుకునేందుకు, సంఘటితాన్ని చాటేందుకు గ్రామస్తులు తమ పిల్లలకు సామూహిక వివాహాలు చేస్తుండటం ఇక్కడి విశేషం.

అమృతనిలయం.. జామ్‌గావ్

కుభీర్ మండలకేంద్రం నుంచి కొండలు, గుట్టలు.. ఎత్తుపల్లాల రోడ్లు దాటుకుని వెళ్తే మహారాష్ట్రకు, మనకు సరిహద్దులో ఉంటుంది జామ్‌గావ్. ఎక్కడో సరిహద్దులో మారుమూలన ఉండే ఈ గ్రామంలో ఏముంటుందని వెళ్తే.. ఈ చిన్నపల్లె ఎంతో నేర్పిస్తుంది. ఇక్కడి ప్రజలూ మద్యాన్ని దూరం పెట్టారు. ఎక్కడో ముంబైలో పాండురంగశాస్త్రి అఠవలె ప్రారంభించిన స్వాధ్యాయ పంథాను జామ్‌గావ్ అందిపుచ్చుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే స్వాధ్యాయ ఆధ్వర్యంలో నిర్మించిన తొలి అమృతాలయం ఈ గ్రామంలోనే అయ్యేంతగా మారిపోయింది. దీని కేంద్రంగా ఆ ఊళ్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. మద్యానిషేధంతో పాటు ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మించుకుంది. దీపావళి, దసరా పండుగలప్పుడు ఒకరింటికి మరొకరు వెళ్లి జరుపుకోవడం, మంచిని ప్రచారం చేయడానికి ఊరంతా ఇతర గ్రామాలకు వెళ్లడం, ఏడాదికోసారి ఊరంతా కలిసి ఒక చేనులో పంట పండించి ప్రత్యేక రోజుల్లో వినియోగించుకోవడం.. జామ్‌గావ్‌వాసులకున్న అదనపు ఆకర్షణలు.



జామ్‌గావ్‌లో నిర్మించుకున్న అమృతాలయం



పాంగ్రాలో ముచ్చటిస్తున్న పెద్దమనుషులు (ఫైల్)

హ్యాట్రిక్ అవార్డు పొందిన 'స్త్రీనిధి'



డీఆర్డీవో, ఆర్‌ఎంకు అవార్డు ఇస్తున్న మంత్రి సీతక్క

నిర్మల్: స్త్రీనిధి రుణాల అందజేత, రికవరీలో వరుసగా మూడోసారి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించిన జిల్లా అవార్డును సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీనిధి ఆర్‌ఎం సరిత తదితరులు ఈ అవార్డును అందుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యం రూ.98కోట్లు కాగా, లక్ష్యానికి మించి ఏకంగా రూ.105కోట్ల రుణాలను ఇవ్వడంతో పాటు వందశాతం రికవరీ చేశారు. హ్యాట్రిక్ అవార్డుతో పాటు మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారుల అభినందనలు అందుకోవడంపై డీఆర్డీవో, ఆర్‌ఎం, స్త్రీనిధి సిబ్బంది, సభ్యులు హర్షం వ్యక్తంజేశారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం నిర్వహించనున్న వేడుకలను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా ఇప్పటికే గ్రామగ్రామాన పండుగ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న వేడుకలకు తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించనున్నారు.

కార్యక్రమ వివరాలు ఇలా..

ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 10.05గంటలకు గౌరవవందనం స్వీకరిస్తారు. 10.10 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం, 10.30గంటలకు శకటాల ప్రదర్శన, 10.45 నుంచి 11.25గంటల వరకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 11.25గంటలకు ప్రశంసాపత్రాలు, బహుమతుల ప్రదానం, 12.00గంటలకు స్టాళ్ల సందర్శన ఉంటుంది.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: డీఈవో కార్యాలయంలో ఏపీవో (కంప్యూటర్ విభాగం) గా పనిచేసేందుకు ఎస్టీటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీజీడీసీఏ అర్హత కలిగినవారు ఈనెల 24లోపు బయోడేటా వివరాలతో డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుపై సంబంధిత హెచ్‌ఎంల ధ్రువీకరణ తప్పనిసరి అని పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యం పెంచుకోవాలి



దేవసేనకు చిత్రపటాన్ని ఇస్తున్న విద్యార్థిని

భైంసాటౌన్: విద్యార్థులు దృఢ సంకల్పం, ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని పాఠశాల, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన సూచించారు. బుధవారం బాసర ఆర్జీయూకేటీలో నిర్వహించిన ఓరియంటేషన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లోని ఆడిటోరియంలో పీయూసీ ఫస్టియర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ర్యాంకుల వేటలో విద్యార్థులు ఒత్తిడి తాళలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కార్యాచరణ ఆధారిత విద్యను ప్రోత్సహించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి జీవితం నాశనం చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులకు క్షోభను మిగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. అంతకుముందు వీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. బాగా చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం కళాశాల ఫస్టియర్‌కు చెందిన దివ్యాంగ విద్యార్థిని గీసిన చిత్రపటాన్ని దేవసేనకు అందించారు. కార్యక్రమం ముగింపులో మాదకద్రవ్య రహిత సమాజం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద మొక్కలు నాటారు. అసోసియేట్ డీన్స్ పావని, చంద్రశేఖర్, మహేశ్, కార్యక్రమ కోఆర్డినేటర్ గజ్జల శ్రీనివాస్, పవన్, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వ అండ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

దస్తురాబాద్: నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 11మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం మండలంలోని గోడిసిర్యాల, గోడిసిర్యాల గోండుగూడ గ్రామాల్లో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త లక్ష్మీనారాయణ, తొడసం రాజు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మండలాధ్యక్షుడు సింగరి కిషన్ రచించిన దేశభక్తి పాటను యూట్యూబ్ చానల్‌లో విడుదల చేశారు. రానున్న గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మట్టి గణపతులను పూజించాలని ఎమ్మెల్యే బొజ్జు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ సర్ఫరాజ్ నావాజ్, ఎంపీడీవో రమేశ్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గంగాభవాని, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు రమేశ్‌రావ్, చుంచు వెంకన్న, రాజేశం, స్వామి, నాగరాజు, పుల్యానాయక్, అంజన్న తదితరులున్నారు.

ఘనంగా అఖండ భారత్ సంకల్ప్ దివస్



నిర్మల్‌చైన్‌గేట్: కార్యక్రమంలో నాయకులు



కుభీర్: మండల కేంద్రంలో..

నిర్మల్‌చైన్‌గేట్: హిందూవాహిని నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ బస్తీలో అఖండ భారత్ సంకల్ప్ దివస్‌ను పురస్కరించుకుని బుధవారం భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో హిందూవాహిని పట్టణాధ్యక్షుడు మంద పవన్, సహసంయోజక్ కందుల ముఖేశ్, నాయకులు మనోజ్, మహేశ్, బద్రి సాయి, దేశ్ పాండే, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుభీర్ మండలంలో..

కుభీర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద హిందూవాహిని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అఖండ భారత్ సంకల్ప్ దివస్ సందర్భంగా కాషాయజెండా ఎగురవేశారు. భారతమాత, సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. నాయకులు నందు, వివేక్, ఏశాల దత్తాత్రి, గంగాధర్, అభిషేక్, తోకల రాజు తదితరులున్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


రాజేశ్వర్ (ఫైల్)

ఖానాపూర్: దుబాయ్‌లో మృతి చెందిన ఖానాపూర్ వాసి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన పుల్కం రాజేశ్వర్ (42)కు ఈ నెల 8న దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య ప్రవళిక, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికోలకు భద్రతెంత?

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలటౌన్: 'వైద్యో నారాయణో హరి' అంటే.. వైద్యుడు దేవునితో సమానమని అర్థం. కళ్లెదుట కనిపించే వైద్యుడినే ఆపదలో ఉన్న వారు దేవునిగా భావిస్తారు. కానీ ఎంతో మంది ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుండా పోతోంది. ఇటీవల కోల్‌కతాలో ఓ వైద్య విద్యార్థిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తెలిసిందే. దీంతో దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రిమ్స్‌లో ఓ పీజీ వైద్యురాలిపై గైనిక్ డిపార్ట్‌మెంట్‌లో మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ దాడికి పాల్పడింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కాగా రిమ్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కొంతమంది ధ్వంసం చేయడం, అందులో వీడియో రికార్డు కాకుండా పక్కకు నెట్టేయడం వంటివి చేస్తున్నారు. దీంతో రిమ్స్‌లో మెడికోలకు భద్రత ఎంత? అనే ప్రశ్న తలెత్తుతోంది.

- రిమ్స్‌లో తరచూ చోటు చేసుకుంటున్న ఘటనలు
- నిఘానేత్రాలు ఉన్నా.. పనిచేయని వైనం
- వైద్య విద్యార్థులపై బయటి వ్యక్తుల దాడి
- ఇటీవల కూడా ఓ పీజీ వైద్యురాలిపై ..

రిమ్స్‌లో రక్షణ కరువు

రిమ్స్‌లో మెడికోలతో పాటు సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులు వసతిగృహంలో ఉంటూ చదువుతో పాటు సేవలు అందిస్తున్నారు. రెగ్యులర్ వైద్యులు అందుబాటులో లేనప్పటికీ వీరే అన్నీతామై రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే మెడికోలకు మాత్రం రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అర్ధరాత్రి కొంతమంది బయటి వ్యక్తులు వసతిగృహంలోకి చొరబడి మెడికోలపై దాడికి దిగారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ఘటనకు సంబంధించి వ్యక్తులను గుర్తించడంలో కొంత ఆలస్యం జరిగింది.


కోల్‌కతా ఘటనకు సంబంధించి డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలు

రిమ్స్‌లో చోటు చేసుకున్న ఘటనలు..

- గతేడాది రిమ్స్ వసతిగృహంలో ఉండే మెడికోలపై నలుగురు బయటి వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వైద్య విద్యార్థులను వాహనంతో ఢీకొట్టేందుకు యత్నించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.
- గతేడాది బాలికల వసతిగృహం వెనుక వైపు నుంచి పైపు సహాయంతో కొందరు వ్యక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించారు. గమనించిన మెడికోలు కేకలు వేయడంతో పరారయ్యారు.
- పక్షం రోజుల క్రితం రిమ్స్ న్యూ క్వార్టర్స్‌లో చెత్త ఏరుకునేవారు మహిళా పీజీలు ఉండే రూమ్ తలుపు తట్టడంతో భయాందోళనకు గురయ్యారు. బయటకు వచ్చి చూసే సరికి వారు పరారయ్యారు.
- గత నెలలో గైనిక్ వార్డులో మహారాష్ట్రకు చెందిన బాలింత వెంబడి వచ్చిన సహాయకురాలు పీజీ వైద్యురాలితో వాగ్వివాదానికి దిగి ఆమెపై చేయి చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్ చేశారు.
- గత నెల ఓ పీజీ వైద్యుడు రిమ్స్‌లో చదివే మెడికోను తన వాహనంలో ఎక్కించుకుని కలెక్టర్ చౌక్‌లో ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు తండ్రితో కలిసి టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది.
- రిమ్స్ వసతిగృహంతో పాటు ఆయా వార్డుల్లోని సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు, ఆటోలు, ఇతర వస్తువులను దొంగలు దోచుకెళ్తున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ ఇలాంటివి చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

అప్పట్లో మెడికోలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మెడికోలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయడంతో శాంతించారు. కాగా రిమ్స్ హాస్టల్ వైపు 38 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వాటిలో కొన్ని పనిచేయడం లేదు. ఎస్ఎంసీ కోసం 26, రిమ్స్ ఓపీ విభాగంలో 28, ఇన్‌పేషెంట్ విభాగంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ కొంత కాలంగా అవి పనిచేయడం లేదు.

కోల్‌కతా ఘటనపై నిరసన..

కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించి బుధవారం రిమ్స్‌లో మెడికోలు నిరసన చేపట్టారు. విధులు బహిష్కరించి రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. కలకత్తాలో సంఘటన జరిగిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రిమ్స్‌లో పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, మౌనిక, అన్వేష్, కార్తీక్, ప్రసన్న, ప్రత్యూష, నందీశ్వర్, కారుణ్య, తదితరులు పాల్గొన్నారు.

పోకిరీల వేధింపులు

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థినులకు పోకిరీల నుంచి వేధింపులు తప్పడంలేదు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో రెండేళ్ల క్రితం ప్రారంభించిన మెడికల్ కళాశాలకు సమీపంలోనే అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. కళాశాల నుంచి హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పోకిరీలు బైక్‌లపై వేగంగా వస్తూ, హారన్ మోగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాలేజీ ఆవరణలోనే విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో ఆ సదుపాయం లేకపోవడంతో సమీపంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని అందులో హాస్టల్ నిర్వహిస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినుల నుంచి డిమాండ్ ఉంది.

భద్రత కల్పించాలి



రిమ్స్‌లో తరచూ ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటోంది. సెంట్రల్ ఫోర్స్‌తో ప్రత్యేక భద్రత కల్పించాలి. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రిమ్స్ ప్రధాన గేటు ఎదుట కొందరు వ్యక్తులు మద్యం మత్తులో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అక్కడ ఫుట్‌పాత్ వద్ద ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలి.

– మౌనిక, పీజీ విద్యార్థిని, ఆదిలాబాద్

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



కాలేజీలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఏం జరుగుతుందో పరిశీలిస్తున్నాం. కాలేజీ, హాస్టల్ రెండు వేర్వేరుగా ఉండడంతో విద్యార్థులు నడిచి వెళ్తున్నారు. బస్సు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. బస్సు కేటాయిస్తే వారికి మరింత రక్షణ ఉంటుంది. విద్యార్థినులు వెళ్లే సమయంలో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

– డాక్టర్ ఎండీ సులేమాన్, మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



రిమ్స్‌లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతేడాది జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ చుట్టూ, ముందు భాగంలో 38 సీసీ కెమెరాలు అమర్చాం. ప్రతీరోజు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. బయటి వ్యక్తులు హాస్టల్‌లోనికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నాం. మూడు షిఫ్టుల్లో ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించాం. రిమ్స్‌లో ప్రత్యేక భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు విన్నవించాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

అక్రమ నిర్మాణాల తొలగింపు


పొక్లెయిన్‌తో నిర్మాణాలు తొలగిస్తున్న గ్రామస్తులు

ముథోల్: బస్టాండ్ సమీపంలోగల డ్రైనేజీపై అక్రమ నిర్మాణాలను బుధవారం గ్రామస్తులు పొక్లెయిన్‌తో తొలగించారు. డ్రైనేజీపై అక్రమ నిర్మాణాల కారణంగా వర్షపు నీరు రోడ్డుపై చేరి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోందని వారు తెలిపారు. జనావాసాల్లో మురుగునీరు నిల్వ ఉంటోందని పేర్కొన్నారు. ఎన్నిసార్లు చెప్పినా నిర్మాణాలు తొలగించకపోవడంతో సమస్య పరిష్కారానికి తామే పూనుకున్నట్లుతెలిపారు.

222 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


రైస్‌మిల్లులో పట్టుకున్న బియ్యంతో సీఐ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి కేలో బుధవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. రైస్ మిల్ యజమాని చిలమంతుల హరిక్రిష్ణ, డ్రైవర్ మహేష్ లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి రైస్‌మిల్లులో నిల్వచేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు కరీంనగర్ విజిలెన్స్ టీం సీఐ ప్రశాంత్‌రావు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్‌లోకి అన్‌లోడ్ చేయడానికి వచ్చిన టాటా ఏస్ వాహనంతో పాటు రైస్‌మిల్లులో నిలువ ఉంచిన 222 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు, వాహనాన్ని లక్ష్మణచాంద పోలీస్ స్టేషన్‌కు తరలించి రైస్‌మిల్ యజమాని హరిక్రిష్ణ, డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కార్తీక్‌రెడ్డి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం


బాబును చూపిస్తున్న 108 సిబ్బంది

సారంగపూర్: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన అశ్వినికి బుధవారం తెల్లవారు జామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో నిర్మల్ ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చించోలి(బి) సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్రమత్తమైన ఈఎంటీ ప్రభాకర్, పైలట్ సంతుజ్ఞానేశ్వర్ సదరు మహిళకు పురుడు పోయడంతో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే తల్లీ బిడ్డలను నిర్మల్ ప్రసూతి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. 108 సిబ్బందికి మహిళ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న జ్యోతి

నిర్మల్‌రూరల్: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మైనార్టీ గురుకులాలు, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్‌గా జ్యోతి నియమితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన శ్రీధర్ రామగుండం బదిలీపై వెళ్లారు. అనంతరం జ్యోతి సిలబస్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు.

గదుల వేలం వాయిదా

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపాల్టీ పరిధిలో గల 26 గదులకు నిర్వహించనున్న బహిరంగ వేలాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష డీడీ చెల్లించాల్సి ఉన్నప్పటికీ పలువురు పట్టణవాసుల అభ్యర్థన మేరకు దానిని రూ.60వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 26 గదులకు వేలంలో పాల్గొనేవారు ఈ నెల 19వ తేదీ లోపు రూ.60వేల డీడీని కార్యాలయ పనివేళలో అందజేయాలని సూచించారు.

పిప్రి ఎక్స్‌రోడ్డుపై గ్రామస్తుల బైఠాయింపు


సముదాయిస్తున్న సీఐ, తహసీల్దార్

ముథోల్: పిప్రి గ్రామానికి చెందిన మగ్దుమ్ (44) మంగళవారం రాత్రి ఇంట్లో కరెంటు రాకపోవడంతో స్తంభం వద్దకు వెళ్లి కర్రతో కదిలిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్తంభం సపోర్టు వైరు తెగి అక్కడే పడి ఉన్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ బుధవారం మృతుని బంధువులు, గ్రామస్తులు పిప్రి ఎక్స్‌రోడ్డు వద్ద రహదారిపై బైఠాయించారు. విద్యుత్‌శాఖ అధికారులు వచ్చేంత వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని పట్టుబట్టారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని వారిని సముదాయించారు. అయినా వినకపోవడంతో భైంసా ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డిని రప్పించడంతో సంబంధిత ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పెంపుడు కుక్కకు కేశఖండనం


జోతో శంకర్

నిర్మల్: తనకు కొడుకులు లేకపోవడం, భార్య దూరం కావడంతో ఆయన తన పెంపుడు కుక్కనే బాబులా భావిస్తున్నాడు. ఈ క్రమంలో కేశఖండనమూ చేయించాడు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న పాయం శంకర్ తన పెంపుడు కుక్క జో(4నెలలు)కు బుధవారం సాయంత్రం స్థానిక టీఎన్‌జీవోస్ భవన్‌లో కేశఖండన కార్యక్రమం నిర్వహించారు. సెలూన్‌లో కటింగ్ చేయించి బంధుమిత్రులకు విందు ఇచ్చారు. శంకర్ భార్య లక్ష్మి 12 ఏళ్ల క్రితం మరణించారు. కుమార్తె ప్రసన్న ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతోంది. ఇక శంకర్ తన తండ్రి చిలుకయ్యతో కలిసి ఉంటున్నాడు. జో తన కొడుకుగా భావిస్తూ పెంచుకుంటున్నారు. తన బాబుకు ఎలాగైతే సేవలు చేస్తారో అలాగే జోనూ సాకుతుండడం విశేషం.